క్లుప్తంగా

క్షేత్రస్థాయి పరిశీలన



మొవ్వ: నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ఐటీఈఆర్‌సీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సచివాలయం-1లో ఒక రోజు శిక్షణ పొందారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం పసుపులేటి శివకోటేశ్వరరావు ఆధ్వర్యంలో 9,10 తరగతులలోని వృత్తి విద్యా కోర్సుల(ఐటీ) విద్యార్థులు 60 మంది మంగళవారం నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ మహేష్, డిజిటల్ అసిస్టెంట్ నవీన్‌కుమార్ ఒకరోజు శిక్షణ ఇచ్చారు.

సూర్యఘర్‌పై అవగాహన కల్పించాలి

మొవ్వ: ఆర్థిక చేయూత, పర్యావరణ పరిరక్షణకు మేలుచేసే పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలియోజన పథకంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ జే విమాదేవి అధికారులకు పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, వెలుగు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎంఎస్‌కే పరమాత్మ, సూర్య ఘర్ ప్రతినిధి సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ఘాట్‌ను సందర్శించిన నాయకులు



నందివాడ: మండలంలోని జనార్ధనపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మండల వ్యవసాయ సలహా సంఘం మాజీ అధ్యక్షుడు కొండపల్లి కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇడుపులపాయకు వెళ్లారు. అక్కడ వైఎస్సార్ ఘాట్‌ను మంగళవారం సందర్శించారు. వైఎస్సార్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో 50 మంది నాయకులు పాల్గొన్నారు

రామకృష్ణకు నివాళి



గుడివాడ టౌన్: సిటీ కేబుల్ వ్యవస్థాపకుడు పొట్లూరి రామకృష్ణ జయంతి వేడుకలు మంగళవారం స్థానిక సిటీకేబుల్ కార్యాలయంలో నిర్వహించారు. గుడివాడ సిటీకేబుల్ ఎండీ కొల్లి నారాయణ ప్రసాద్ రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ ఇ. అర్జునరావు, ఆపరేటర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం అమ్మకాలపై 35 కేసుల నమోదు

గుడ్లవల్లేరు: అక్రమ మద్యం అమ్మకాలను నిర్వహించే నిందితులపై 35 కేసులను నమోదు చేసినట్లు గుడివాడ ఎక్సైజ్ సీఐ పి.వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ సర్కిల్ పరిధిలో ఎక్కడికక్కడ అక్రమ మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. బెల్టు షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు గుడివాడ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని కేసుల్లో 35 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. 406 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ క్యాంపు



మండవల్లి: లోకుమూడి భవిత సెంటర్‌లో నిర్వహించిన ఫిజియోథెరపీ క్యాంపులో ఎనిమిది మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు మంగళవారం ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సునీత వ్యాయామ చికిత్స చేశారు. ఇదేవిధంగా ఇంటి వద్ద ఉదయం, సాయంత్రం చేయించినట్లయితే త్వరగా కోలుకుంటారని ఆమె పేర్కొన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఈ క్యాంపును చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని లోకుమూడి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎండీ సుఫియాన్ పేర్కొన్నారు. ఐఈఆర్‌టీలు టి.అరుణకుమారి, పి.వసంత, డి.శైలజ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆసరాగా భవిత

ప్రత్యేక అవసరాల చిన్నారులకు అండగా కేంద్రాలు

దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రాలు ఆసరాగా నిలుస్తున్నాయి. అవయవాల లోపం, బుద్ధి మాంద్యం వంటి మానసిక, శారీరక వైకల్యంగల చిన్నారుల్లో మనోధైర్యం నింపి వారిలో పురోగాభివృద్ధికి భవిత కేంద్రాలు దోహదపడుతున్నాయి.



గుడివాడ భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ కామరాజు

గుడివాడరూరల్: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో భవిత కేంద్రాలు మనోధైర్యాన్ని నింపుతున్నాయి. సాధారణంగా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు ఇంటికే పరిమితమయ్యేవారు. దీంతో వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలు భవిత కేంద్రంలో నిర్వహిస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల్లో నూతనోత్సాహం నింపి వారి మనోవికాసానికి బాటవేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో గతంలో వారి వ్యక్తిగత పనులను కూడా చేసుకోలేని పిల్లలు సైతం వారి అవసరాలను వారు సొంతంగా చేసుకునే స్థితికి అభివృద్ధి చెందడంతో వారి తల్లిదండ్రులు భవిత కేంద్రాల నిర్వహణపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆటపాటలతో ప్రోత్సాహం

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందజేసే సహిత విద్యను విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్ష పథకం ద్వారా భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు సంరక్షించి వారికి 21 రకాల సేవలతో కూడిన సహిత విద్యను అందిస్తున్నారు. వీరికి మధ్యాహ్న భోజనంతో పాటు మానసిక ఉల్లాసానికి అవసరమైన ఆటపాటలతో ఉత్తేజపరిచి వారిని ప్రోత్సహిస్తున్నారు. మున్సిపాల్టీ పరిధిలోని పట్టణంలోని సత్యనారాయణపురంలో సమగ్ర శిక్ష భవిత కేంద్రం, నందివాడ మండలం తమిరిశలో, గుడ్లవల్లేరులోని అంబేడ్కర్‌నగర్‌లో భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులను ప్రోత్సహించి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన

గుడివాడలో సోమవారం, తమిరిశలో మంగళవారం, గుడ్లవల్లేరులో బుధవారం ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఫిజియోథెరపీ ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తారు. ఈ శిక్షణ కేంద్రం ద్వారా ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు అందించాల్సిన ఫిజియోథెరపీ గురించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో శరీర వైకల్యాన్ని తగ్గించేందుకు తేలికపాటి యోగాసనాలు, ఎక్సర్‌సైజ్‌లను వివరిస్తున్నారు. అంతేగాక వారి తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు. వీటితో పాటు మంచానికే పరిమితమైన వారిని వారంలో రెండు రోజులు గృహ సందర్శనం చేసి సహిత ఉపాధ్యాయుల ద్వారా వారికి అవసరమైన ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు.

పరికరాలు అందజేత

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భవిత కేంద్రాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలను అందజేశారు. వినికిడి, ఇతర శరీర అవయవ లోపాలు కలిగిన చిన్నారులను గుర్తించి సమగ్ర శిక్షా ద్వారా వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లతోపాటు వివిధ రకాల పరికరాలను అందజేసింది. కూటమి ప్రభుత్వం కూడా దివ్యాంగ చిన్నారులను గుర్తించి వారికి అవసరమయ్యే పరికరాలను సకాలంలో అందజేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి



దివ్యాంగ చిన్నారులపై వారి తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. వారిని క్రమం తప్పకుండా భవిత కేంద్రానికి పంపించినప్పుడే వారిలో మానసిక ఉత్సాహం కలిగి పురోభివృద్ధి సాధించగలుగుతారు. రోజూ వారికి అవసరమైన శారీరక శిక్షణను కూడా మా సూచనల మేరకు అందచేయాలి. అప్పుడే వారిలో మార్పును తీసుకురాగలం.

– కామరాజు, ఫిజియోథెరపీ వైద్యులు

క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ



నా కుమారుడు పల్లపోతు వీరరాఘవయ్య పుట్టిన సమయంలో అవయవలోపంతో జన్మించాడు. రోజూ క్రమం తప్పకుండా ఫిజియోథెరపీకి తీసుకొస్తున్నాం. వారి సూచనలు పాటిస్తున్నాం. ఇంటి దగ్గర కూడా అన్ని రకాల ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తున్నాం. దీంతో నా కుమారుడు అందరిలాగానే చదువుకుంటున్నాడు.

– పల్లపోతు ఈశ్వరి, గుడివాడ

కుమారిడి పరిస్థితి మెరుగ్గా ఉంది



నా కుమారుడు పేరు ఆనంద్ అవయవ లోపంతో జన్మించాడు. అధికారులు, తెలిసిన వారి ద్వారా గుడివాడ భవిత కేంద్రంలో చిక్సిత చేయిస్తున్నాం. దీంతో కుమారుడు పరిస్థితి మెరుగ్గా ఉంది. భవిత కేంద్రంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– ఇజ్రాయిల్, గుడివాడ

పల్లాకు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

ముదినేపల్లి రూరల్: మినుము పైరులో సోకే పల్లాకు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు, కొరగుంటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. బొమ్మినంపాడులో రైతులు అవగాహన సమావేశంలో వ్యవసాయాధికారి మాట్లాడారు. ప్రస్తుత వాతావరణం పగలు వేడిగా రాత్రి పూట చలి ఎక్కువగా ఉంటూ మంచు విపరీతంగా కురుస్తున్నందున మినుము పైరులో పల్లాకు, బూడిద తెగుళ్లు వ్యాపించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీనిని గుర్తించి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

సముదాయ ప్రదర్శన క్షేత్రం సందర్శన

మండలంలోని లింగాలలో జాతీయ ఆహార భద్రత మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సముదాయ ప్రదర్శన క్షేత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు మినుము పంటపై పలు సూచనలు చేశారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, రైతుసేవా కేంద్ర ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రతిభ మాస్టారు ఇకలేరు



శ్రీనివాసరావు (ఫైల్)

గుడ్లవల్లేరు: కూరాడ ప్రతిభ విద్యాలయం అధినేత గోపిశెట్టి శ్రీనివాసరావు(52) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో స్థానిక ప్రైవేట్ విద్యాలయాలకు సెలవును ప్రకటించి నివాళులర్పించారు. శ్రీనివాసరావు మృతికి సాయి విద్యా నికేతన్ అధినేత శింగంశెట్టి ఆదినారాయణ తన సంతాపాన్ని ప్రకటించారు.

సీతాఫలం తెగులు నివారిస్తే అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న పామర్రు ఏడీఏ స్వర్ణలత

జురుధువరం(పామర్రు): ప్రస్తుతం మినుము సాగులో అక్కడక్కడా సీతాఫలం తెగులు కనబడుతోందని దీనిని నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ బి.స్వర్ణలత పేర్కొన్నారు. మండలంలోని జురుధువరం, పామర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాఫలం తెగులు నివారణకు డైమిథోయేట్-2 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించామన్నారు. అదే విధంగా బూడిద తెగులు నివారణకు ఒక గ్రాము కార్బండిజిమ్ లేదా ఒక మిల్లీ లీటరు హెక్సాకొనజోల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. ఏఓ శివనాగరాణి పాల్గొన్నారు.

పామర్తి సుబ్బారావుకు ఘన నివాళి



ప్రముఖులను సత్కరిస్తున్న ప్రభాకర నాట్యమండలి సభ్యులు

గుడివాడ టౌన్: ప్రముఖ నాట్య కళాకారుడు, జాతీయ క్రీడాకారుడు పామర్తి సుబ్బారావు వర్ధంతి స్థానిక కైకాల సత్యనారాయణ కళామందిరంలో ప్రభాకర నాట్యమండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. క్రీడాకారుడిగా తన ప్రతిభను జాతీయ స్థాయిలో ప్రదర్శించి మద్రాసులో జరిగిన జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బంగారు ఉంగరాన్ని ప్రత్యేక బహుమతిగా పొందిన ఘనత పామర్తిదేనని వక్తలు అన్నారు. ఇక నాటక రంగంలో వందల సంఖ్యలో నాటికలు ప్రదర్శించి నట ప్రభాకర, హాస్యరత్న తదితర బిరుదులు పొంది అనేకమంది స్టేజి యాక్టర్స్‌ను ప్రోత్సహించి నటులుగా తీర్చిదిద్దిన ఘనత పామర్తికే దక్కుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు, వైద్యులు, ప్రముఖులను సత్కరించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నెరుసు చింతయ్య, ఎంవీజే ఆంజనేయులు, కొమ్ము వెంకటేశ్వర్లు, మట్టా రాజా, వై. కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



గుడివాడ టౌన్: ప్రస్తుత సమాజంలో ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల వినియోగం వంటి దుష్ప్రభావాలపై విద్యార్థులు దృష్టిపడకుండా అప్రమత్తంగా ఉండాలని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ అన్నారు. స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల్లో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులందరికీ సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువగా ఉండదు కనుక వారిలో సైబర్ నేరాలపై అవగాహన పెంచాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు, కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, సీఐ పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని గుడివాడ సీఐ ఎస్.సోమేశ్వరరావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆయన సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సును చేపట్టారు. ఎస్ఐ ఎస్.వి.వి. సత్యనారాయణ, కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజశేఖర్ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



దయ్యంపాడులో నిర్వహించిన పశువైద్య శిబిరం

మండవల్లి: పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని వైద్యులు డాక్టర్ రామకృష్ణ, సూర్యకుమారి అన్నారు. మండలంలోని సింగనపూడి, దయ్యంపాడులో మంగళవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మేకలకు నత్తల నివారణ మందు అందించారు. పలు రకాల టీకాలు వేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: మండలంలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ డిస్పెన్సరీల వైద్యాధికారులు క్రాంతికుమార్, రామకృష్ణ కోరారు. మండలంలోని చిగురుకోట, చినకామనపూడి గ్రామాల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. సిబ్బంది శ్రీనివాసరావు, జ్యోతిబాబు, రవికుమార్, కాశీరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాల్లో పాడి పశువులకు వైద్య పరీక్షలు చేయించి పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ ఉప సంచాలకులు డాక్టర్ సి.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం గుడ్లవల్లేరులో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ లక్ష్మీనారాయణ, సంత కమిటీ చైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు.

శీతాకాలంలో పశువులు జర భద్రం

అప్రమత్తత లేకుంటే ముప్పే

పామర్రు: శీతాకాలం వచ్చిందంటే జీవాలకు వ్యాధులు సోకే అవకాశలు ఎక్కువగా ఉంటాయి. ఈ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా లేకుంటే నష్టపోయే ప్రమాదం ఉందని పశువైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని రకాల వ్యాధుల నివారణకు ఉచితంగా టీకాలు వేయిస్తోంది. రైతు భరోసా కేంద్రాల వద్ద పశు వైద్య సేవలను అందిస్తూ వారికి అవగాహన కల్పిస్తోంది.

పశువులకు వచ్చే వ్యాధులు

పశువులకు వచ్చే వ్యాధులు నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి అంటువ్యాధులు, జీర్ణప్రక్రియ లోపాలు, గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులుగా ఉంటాయి. జీర్ణప్రక్రియ లోపాల వలన వచ్చే వ్యాధులు, కీటోసిస్, పాలజ్వరం, పడక జబ్బు, ఎసిడోసిస్, అల్కలోసిస్, బ్లోట్ జబ్బు, పారుడు జబ్బు.

గర్భకోశ వ్యాధులు

గర్భవాతం, పయోమెట్ర, సెర్వీసైటీస్, తిరిగిపొర్లడం, అనిష్టం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

నివారణ చర్యలు

పశువులకు వచ్చే వ్యాధులను గుర్తించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా సంబంధిత సచివాలయంలోని వెటర్నరీ అసిస్టెంట్‌ను కలిసి వైద్యం అందించాలి. మెరుగైన వైద్యం కోసం వారి సూచనల మేరకు పశువైద్యాధికారిని సంప్రదించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పశువులశాలల్లో గాలి, వెలుతురు బాగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
- పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- పరిశుభ్రమైన నీటిని పశువులకు అందించాలి.
- పచ్చిమేతతో పాటు ఎండు గడ్డి కూడా పెట్టాలి.
- వ్యాధి నిరోధక టీకాలను ఎప్పటికప్పుడు వేయిస్తుండాలి.
- ఈగలు, దోమలను పూర్తిగా నిర్మూలించే చర్యలు తీసుకోవాలి.
- పరాన్న జీవుల నివారణకు చర్యలు చేపట్టాలి.

వైద్యుల సూచనలను తప్పక పాటించాలి



సీజనల్ వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉంటూ పశువైద్యుల సలహాలు, సూచనలను పాటించాలి. ప్రతి గ్రామ సచివాలయం పరిదిలో ఉన్న వెటర్నరీ అసిస్టెంట్‌ల వద్దకు పశువులను తీసుకువెళ్లి వ్యాధి గురించి తెలియజేస్తే వైద్య సేవలు అందిస్తారు. వారి పరిధిలో వ్యాధిని నయం చేయలేని పరిస్థితి ఉంటే రైతులు సంబంధిత పశువైద్యాధికారిని సంప్రదిస్తే తగు వైద్యం అందిస్తారు.

– సునీల్‌కుమార్, మండల పశువైద్యాధికారి

సంక్షిప్త వార్తలు

- **రీసర్వేపై క్షేత్ర పరిశీలన**

ముదినేపల్లి రూరల్: మండలంలోని చినకామనపూడిలో చేస్తున్న భూముల రీసర్వేను క్షేత్ర పరిశీలన చేస్తున్నారు. మండలంలో ప్రక్రియను సోమవారం ప్రారంభించగా రెవెన్యూ సిబ్బంది మండలంలో పర్యటిస్తూ రీసర్వే మంగళవారం కొనసాగించారు. డీటీ ప్రసాద్ పాల్గొన్నారు.

- **సుబ్బారాయుడికి అభిషేకాలు**

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- **పౌష్టికాహారం తీసుకోవాలి**

నందివాడ: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఐసీడీఎస్ అధికారి విజయ్‌ఫ్లోరెన్స్ అన్నారు. మండలంలోని పెదలింగాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. సూపర్‌వైజర్ నాగశిరీష పాల్గొన్నారు.

- **నిందితుడి ఆచూకీ తెలపండి**

గుడివాడ టౌన్: గుడివాడ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన నిందితుడు బి. రాములు(30) ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మచిలీపట్నం ఏడీఎం కోర్టులో కేసుకు హాజరు కావాల్సిన రాములు హాజరు కాకపోవడంతో అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ అయిందని తెలిపారు.

- **31న హుండీ లెక్కింపు**

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు ఈ నెల 31వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 11 గంటలకు దేవస్థానం ప్రాంగణంలో లెక్కింపు జరుగుతుందని పేర్కొన్నారు.

- **పింఛన్‌దారులకు కంటి పరీక్షలు**

గుడివాడ టౌన్: కంటిచూపు కరువై ఏ పని చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పింఛన్ కత్తిరించే పనిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన వడపోత కార్యక్రమం గుడివాడలో మంగళవారం జరిగింది. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్య నిపుణులు బృందం ప్రత్యేక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరాదేవి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ బి. నాగజ్యోతి, వి. స్వప్నలత పాల్గొన్నారు.

- **హెల్మెట్ వినియోగంపై అవగాహన**

నందివాడ: మండలంలోని జనార్దనపురంలో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు నందివాడ పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలన్నారు.

- **ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరు షెడ్ దగ్ధం**

మండవల్లి: భైరవపట్నంలో చెత్త తగలబెడుతుండగా కరెంటు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు జరిపే షెడ్ మంగళవారం అగ్ని ప్రమాదానికి గురైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. రూ. 30 వేలు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

- **ఫిల్టర్‌బెడ్ల పనుల పరిశీలన**

మండవల్లి: అగ్రహారం కొండరాయి చెరువు తాగునీటి పథకం-2 వద్ద రెండు ఫిల్టర్‌బెడ్ల పనులు చేస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్ దంపతులు మంగళవారం పరిశీలించారు.

- **వీరాంజనేయస్వామికి అభిషేకాలు**

పామర్రు: పుష్యమాసం చివరి మంగళవారం కావడంతో స్థానిక వీరాంజయేయస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామికి విశేషంగా పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు అర్చకులు రామాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఈఓ ప్రసాద్ తెలిపారు.

- **జూదరుల అరెస్టు**

కైకలూరు: పల్లెవాడలో పేకాట జరుగుతుందని సమాచారంతో సోమవారం రూరల్ ఎస్సై వి.రాంబాబు దాడి చేశారు. 16 మంది జూదరులను అరెస్టు చేసి రూ.97,600ను స్వాధీనం చేసుకున్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



సన్మానించిన ఘంటసాల కళాపీఠం సభ్యులు

పామర్రు: రిపబ్లిక్ డే సందర్భంగా పురస్కారాలు అందుకున్న మండల అధికారులకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ ఆధ్వర్యంలో సన్మానించారు. తహసీల్దార్ జీ రవికాంత్, డీటీ గోపాల్, ఏఓ శివనాగరాణిని సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాము, వీఆర్వో ఫణిప్రియకుమార్, కళాపీఠం సభ్యులు సాయిబాబు, వెంకట నాంచారయ్య పాల్గొన్నారు.



నందివాడలో అధికారులకు సన్మానం

నందివాడలో..

నందివాడ: రిపబ్లిక్ డే రోజున ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెయ్యాల ఆదాము మంగళవారం సన్మానించారు. ఎంపీడీఓ మల్లేశ్వరి, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, నందివాడ పెదవిరివాడ కార్యదర్శులు సురేష్‌బాబు, ఉషారాణిని సత్కరించారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారించాలి



కైకలూరు: వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అడవి కృష్ణ పేర్కొన్నా రు. మండల పరిషత్ హాల్లో సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవి నేపథ్యంలో ఇప్పటి నుంచే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కైకలూరు టౌన్, కొత్తపేటలో ఎనిమిదో తరగతి వరకు ఉర్దూ పాఠశాలు ఉన్నాయన్నారు. వీరికి 9, 10 తరగతులను కూడా ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ఏర్పాటు చేయడానికి జిల్లా విద్యాశాఖాధికారులకు నివేదిక పంపడానికి నిర్ణయించామన్నారు. అనంతరం రిపబ్లిక్ డే సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు పొందిన శీతనపల్లి డాక్టర్ అన్నపూర్ణ, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి శివనారాయణ, వేమవరప్పాడు వీఏఏ గోపి, భుజబలపట్నం సర్వేయర్ జి.దుర్గాభవానీలను సన్మానించారు. ఎంపీడీఓ ఫణీంద్ర, వైస్ ఎంపీపీ జహీర్, ఈఓపీఆర్డీ కొండలరావు పాల్గొన్నారు.